Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
21-01-2026

# మహా పత్రిక

ANN తెలుగు

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 26 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD బుధవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## విభిన్న కథనాలకు కేరాఫ్ మహా తెలుగు దినపత్రిక

### ప్రజలను చైతన్య పరచడంలో కీలక పాత్ర

**గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ చేతుల మీదుగా మహా తెలుగు దినపత్రిక వారు రూపొందించిన 2026 ఆంగ్ల నూతన సంవత్సరం క్యాలెండర్ ను వరంగల్ మహా తెలుగు దినపత్రిక గ్రేటర్ వరంగల్ ప్రతినిధి ఈద శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ కమీషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో వార్తల సేకరణలో ముందు ఉంటూ నిత్యం ప్రజలకు వార్తా విశేషాలను వేగంగా చేరవేస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ సమాజ శ్రేయస్సు కోరి వివిధ విభిన్న కథనాలను ప్రచురిస్తూ ప్రతి ఒక్కరిలో సామాజిక స్పృహను కలిగించేలా కృషి చేస్తూ సమ సమాజ నిర్మాణానికి పాటుపడుతున్న "మహా తెలుగు దినపత్రిక" యజమాన్యానికి, ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాగే ప్రతి సంవత్సరం ప్రజల ఆదరణను పెంపొందించుకుంటూ భవిష్యత్తులో కూడా మీడియా రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రజా ఆదరణతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ మహా దినపత్రిక పాఠకులకు, అభిమానులకు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బల్దియా అధికారులు, సిబ్బంది, మహా దినపత్రిక రిపోర్టర్లు,తదితరులు పాల్గొన్నారు.

**టాప్ న్యూస్**

### ఈ వారంలో నోటిఫికేషన్


- 24 లేదా 27న ముహూర్తం
- కలెక్టర్లతో రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ లు



02

### దావోస్‌లో ట్రంప్ విందు

- ఏడుగురు భారతీయ సీఈవోలకు ఆహ్వానం



02

### బాస్ బస్టర్

- మెగా మూవీపై అల్లు అర్జున్ రియాక్షన్



02



# సిట్ ముందుకు హరీష్

## ఫోన్ ట్యాపింగ్ పై ఏడున్నరగంటల ప్రశ్నల వర్షం

జూబ్లిహిల్స్ పోలీసుస్టేషన్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు హైడ్రామా

సిట్ నన్నడగడం కాదు.. సిట్ నే వందల ప్రశ్నలు అడిగా హరీష్ రావు

దమ్ముంటే వీడియో బయటపెట్టాలని ఛాలెంజ్

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీష్ రావును సిట్ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు దాదాపు ఏడున్నర గంటల పాటు సాగిన ఈ విచారణలో అధికారులు హరీష్ రావుపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పటికే అరెస్టయిన మాజీ పోలీసు అధికారులు ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు ,ఇటీవల విచారణ ఎదుర్కొన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు ఓ టీవీ చానల్ ఎండీ శ్రవణ్ రావు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా హరీష్ రావును ప్రశ్నించారు.

మిగతా 2లో



### నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా

- విచారణ అనంతరం హరీశ్ రావు
- దమ్ముంటే విచారణకు సంబంధించిన వీడియోలు విడుదల చేయాలని సవాల్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకేం సంబంధమని ప్రశ్న

02

# దావోస్‌లో తెలంగాణ తొలి విజయం

- భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి పనిచేయనున్న యుఏఈ
- తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి యూఏఈ ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం వెల్లడి
- గూగుల్ బృందానికి సీఎం కృతజ్ఞతలు



**దావోస్ :** భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 సదస్సులో భాగంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ లో ఇప్పటికే మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా

మిగతా 2లో

## బీజేపీ చేతిలోనే దేశం సురక్షితం

బెంగాల్, తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం

నబీన్ ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధాని మోదీ



**ఢిల్లీ, మహా :** భారతీయ జనతా పార్టీ చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. గత 12 ఏళ్లలో ఎన్నో రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని గుర్తు చేసుకున్నారు. తొలిసారి బంగాల్, తెలంగాణలో కూడా అధికారంలోకి రానున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీది మాత్రం ఎల్లప్పుడూ అభివృద్ధి మోడల్ అంటూ చెప్పుకొచ్చారు.

మిగతా 2లో



## అలుపెరుగని జూపల్లి

- ఒక్కరోజులో నాలుగు జిల్లాల చుట్టేసిన మంత్రి
- 48 గంటలు.. 1000 కిలోమీటర్ల 'మారథాన్ టూర్
- అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ లో జూపల్లి కృష్ణారావు నిబద్ధత
- మంత్రి పనితీరుకు ఆశ్చర్యపోతున్న నేతలు, అధికారులు

**ఆదిలాబాద్, మహా:** తెలంగాణా రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు ప్రజాసేవలో తన నిబద్ధతను చాటి చెప్పారు. రోడ్డు మార్గంలో సుడిగాలిలా పర్యటించి ఒక్కరోజులో నాలుగు జిల్లాలను మెరుపు వేగంతో

మిగతా 2లో

## మెడికల్ హబ్‌గా జగిత్యాల జిల్లా

### మెడికల్ కాలేజ్ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూస్తా..

- అన్ని సౌకర్యాలు హంగులు అద్భుతంగా నిర్మించేలా కృషి చేస్తా..
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- జగిత్యాల లో రూ. 235 కోట్లతో 450 పడకల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన
- క్రిటికల్ కేర్ భవనం ప్రారంభోత్సవం

02





# సిట్ ముందుకు హరీష్

(మొదటిపేజీ తరువాయి)

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఇంటెలిజెన్స్ అధికారులతో మీకున్న సంబంధం ఏమిటి? ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఎన్నికల సమయంలో లేదా ఇతర రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారా? అన్న కోణంలో ప్రధానంగా ప్రశ్నలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా సిద్దిపేట ప్రాంతానికి చెందిన రియల్టర్ చక్రధర్ గౌడ్ ఫిర్యాదు, ఆ సమయంలో జరిగిన కాల్ డేటా సేకరణపై హరీష్ రావును అధికారులు వివరణ కోరినట్లు తెలుస్తోంది.

### నేను హోంమంత్రిని కాదు

సిట్ ప్రశ్నలకు హరీష్ రావు తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పదేళ్లలో మేము చట్టానికి లోబడే పనిచేశాం, ఏ అధికారికి కూడా ఇలాంటి చట్టవిరుద్ధమైన ఆదేశాలు ఇవ్వలేదు అని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఇతర నిందితుల వాంగ్మూలాలను ఉటంకించినప్పుడు.. వారిపై ఒత్తిడి తెచ్చి లేదా ప్రలోభపెట్టి అబద్ధపు సాక్ష్యాలు సృష్టించి ఉండవచ్చు అని ఆయన కొట్టిపారేసినట్లు చెబుతున్నారు. దాదాపు పదేళ్ళు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు కీలక భూమిక పోషించారు. ఇదే అంశాన్ని సిట్ అధికారులు ప్రస్తావించి అసలు ఎందుకు ఫోన్ ట్యాపింగ్ చేయాల్సి వచ్చింది, ఎవరి కోసం, ఎవరి ఆదేశానుసారం ఈ వ్యవహారం జరిగిందన్న అంశంపై ప్రధానంగా సిట్ ప్రశ్నించినట్లు సమాచారం. కొన్నిసందర్భాలలో హరీష్ రావు అధికారులను ఎదురు ప్రశ్నించినప్పటికీ కొన్ని సార్లు అధికారులు గతంలో తాము జరిపిన విచారణ సందర్భంగా రాబట్టిన అంశాలను ముందుంచి వాటిపై వివరణ కోరినట్లు తెలుస్తోంది. క్యాబినెట్ లో దాదాపు రెండవ శ్రేణి నేతగా ఉన్న మీకు ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందన్న విషయం తెలుసా ? లేదా ? అని అధికారులు పదే పదే ప్రశ్నించినపుడు హరీష్ రావు నేను హోంమంత్రిని కాదు అని దాట వేత దోరణిని అనుసరించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ పై కేసీఆర్ కూతురు కవిత చేసిన ఆరోపణలపై కూడా అదికారులు హరీష్ రావు ముందుంచినట్లు సమాచారం. రాజకీయాలలో ఆరోపణలు సహజమేనని, అవన్నీ నిజమని మీరను కుంటున్నారా అని హరీష్ రావు సిట్ అధికారులను ఎదురు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కొన్ని ఆధారాలను హరీష్ రావు ముందుంచిన అధికారులు వాటిపై ప్రశ్నలను సంధించినట్లు తెలుస్తోంది. సుదీర్ఘ విచారణ అనంతరం మరోసారి అవసరమైతే విచారణకు పిలుస్తామని చెప్పి పంపించారు.

**విచారణ సందర్భంగా ఉద్రిక్తత**

**హరీష్ రావు విచారణ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్దకు హరీష్ రావు అనుచరులు బారీగా తరలిరాగా, ఉద్రిక్తత నెలకొంది. సాయంత్రం సమయంలో పలువురు దూసుకురాగా, పోలీసులు వారించి పంపించేశారు.**

# మెడికల్ హబ్‌గా జగిత్యాల జిల్లా

- **మెడికల్ కాలేజ్ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూస్తా..**
- **అన్ని సౌకర్యాలు హంగులు అద్భుతంగా నిర్మించేలా కృషి చేస్తా..**
- **రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
- **జగిత్యాల లో రూ. 235 కోట్లతో 450 పడకల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన. క్రిటికల్ కేర్ భవనం ప్రారంభోత్సవం**



**కరీంనగర్ మహా :** అన్ని రకాల అధునాతన వైద్య సేవలు మెడికల్ కళాశాల, క్రిటికల్ కేర్ యూనిట్, మెడిసిన్ స్టోర్, 450 పడకల ఆస్పత్రి ఏర్పాటుతో జగిత్యాల జిల్లా మెడికల్ హబ్ గా మారనుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. జగిత్యాల లో మంగళవారం రూ. 235 కోట్లతో నిర్మించనున్న 450 పడకల ఆస్పత్రి భవనం పనులకు శంకుస్థాపనతో పాటు క్రిటికల్ కేర్ భవనాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మాతా, శిశు ఆరోగ్య కేంద్రం, మెడికల్ కళాశాల దగ్గర రూ. 235 కోట్లతో 450 పడకల ఆస్పత్రిని నిర్మించుకోబోతున్నామన్నారు. అలాగే రూ. 23.5 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్, రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్లను ప్రారంభించామని తెలిపారు. జగిత్యాల జిల్లా ప్రజలతో పాటు చుట్టు పక్క జిల్లాలకు చెందిన ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రానుందని అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి క్రిటికల్ కేర్ ఏర్పాటుతో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. క్రిటికల్ కేర్, నూతన ఆస్పత్రి జిల్లాలోని 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో జిల్లా కేంద్రంలో విద్య, వైద్యానికి అత్యధిక నిధులు మంజూరయ్యాయని తెలిపారు. క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభంతో డయాలసిస్, అత్యవసర ప్రసూతి శస్త్ర చికిత్సలు, మూడు ఆపరే షన్ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయన్నారు. జగిత్యాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, జగిత్యాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ నాలుగు వైపుల రహదారి తో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 450 పడకల ఆసుపత్రి జగిత్యాల లో నిర్మాణం క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల వల్ల రోడ్డు ప్రమాద బాధితులు అత్యవసర ప్రసూతి బాధితులకు చాలా ప్రయోజనకరంగా తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ చొరవతో 40కోట్ల నిధులు మంజూరు తో మెడికల్ కాలేజీ పనులు త్వరిత గతిన జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యానికి కావలసిన అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మెడికల్ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, డి.ఎం.ఎచ్.వో సుజాత, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ వారంలో నోటిఫికేషన్

- **24 లేదా 27న ముహూర్తం**
- **కలెక్టర్లతో రాణికుముదిని వీడియోకాన్ఫరెన్స్ లు**

**హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుధవారం ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించనున్నారు. గురువారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్లతో, ఈనెల 23న రంగారెడ్డి, మేడ్చల్, ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై చర్చించనున్నారు. ఈనెల 24న లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# దావోస్‌లో ట్రంప్ విందు

**ఏడుగురు భారతీయ సీఈవోలకు ఆహ్వానం**

**మహా :** స్విట్జర్లాండ్‌లో జరుగుతోన్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది దేశాధినేతలు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు దావోస్ చేరుకుంటున్నారు. ఇందులో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరేళ్ల తర్వాత వస్తుండగా.. ఇందులో ఆయన పాల్గొనడం మూడోసారి. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసే విందుకు ఏడుగురు భారతీయ సీఈవోలకు ఆహ్వానం అందినట్లు సమాచారం. టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ మిత్తల్, విప్రో సీఈవో శ్రీని పల్లియా, ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ ఎస్.పరేఖ్, బజాజ్ ఫిన్‌సెర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్, మహీంద్రా గ్రూపు సీఈవో అనీశ్ షా, జూబిలెంట్ భర్తియా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు హరి ఎస్.భర్తియాలు హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాల నుంచి 3వేలకు పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. ట్రంప్ కారణంగా ప్రపంచ ఆర్థికరంగం అతలాకుతలం అవుతున్న నేపథ్యంలో దావోస్ లో ట్రంప్ ప్రసంగంపై ఆసక్తి నెలకొంది.

# సినిమా టికెట్ ధరల పెంపుపై హైకోర్టు సీరియస్

**హోం శాఖ కార్యదర్శికి సుమోటో కంటెంప్ట్ నోటీసులు జారీ**

**హైదరాబాద్, మహా :** సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక ఆదేశాలు జారీ చేసింది. 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు హోం శాఖ జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్‌కు హైకోర్టు సుమోటో కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. గత ఆదేశాలను ధిక్కరిస్తూ మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి ధరలు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ పై అడ్వకేట్ విజయ్ గోపాల్ వాదనలు వినిపిస్తూ హోంశాఖ అధికారులు గత ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారన్నారు. మన శంకర వరప్రసాద్ సినిమా టికెట్ల రేట్లు పెంచిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురాకుండా దాచిపెట్టారంటూ పిటిషనర్ తరఫున న్యాయవాది పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సీవీ ఆనంద్‌కు హైకోర్టు కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ సినిమాస్ రెగ్యులేషన్ యాక్ట్1955 ప్రకారమే ధరల నిర్ణయాలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమాకైనా టికెట్ ధరల పెంపు నిర్ణయం తీసుకునేటప్పుడు 90 రోజుల ముందే ప్రకటించాలని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా మళ్లీ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.

# అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్

**తమిళనాడు అసెంబ్లీ నుంచి గవర్నర్ ఆర్.ఎన్. రవి వాకౌట్**

**వరుసగా మూడవ ఏడాది ప్రసంగాన్ని బహిష్కరించిన గవర్నర్**

**చెన్నై, మహా :** తమిళనాడు రాజకీయాల్లో మంగళవారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రతి ఏటా మొదటి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగించడం ఆనవాయితీ. అయితే, గవర్నర్ ఆర్.ఎన్. రవి తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. వరుసగా మూడో ఏడాది కూడా ఆయన ఇలా ప్రసంగాన్ని బహిష్కరించడం గమనార్హం.

**సభలో అసలేం జరిగింది?**

ఉదయం 9:30 గంటలకు సభ ప్రారంభం కాగానే, స్పీకర్ ఎం. అప్పావు గవర్నర్‌ను ఉద్దేశించి కేబినెట్ ఆమోదించిన ప్రసంగ పాఠాన్ని మాత్రమే చదవాలని, రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి ఉండాలని కోరారు. దీనిపై గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "నా ప్రసంగాన్ని అడ్డుకోవడం దురదృష్టకరం. జాతీయ గీతానికి తగిన గౌరవం ఇవ్వడం లేదు. నా మైక్‌ను కూడా పదే పదే స్విచ్ ఆఫ్ చేస్తున్నారు" అని గవర్నర్ సభలోనే ఆరోపించారు. ఆ వెంటనే ఆయన తన ప్రసంగాన్ని పూర్తి చేయకుండానే సభ నుంచి నిష్క్రమించారు.

**లోక్ భవన్ వివరణ**

గవర్నర్ వాకౌట్ చేసిన కొద్దిసేపటికే ఆయన కార్యాలయం ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. అందులో ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేసింది. ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ పాఠంలో వాస్తవ విరుద్ధమైన, తప్పుదోవ పట్టించే అంశాలు ఉన్నాయని లోక్ భవన్ పేర్కొంది. రాష్ట్రానికి రూ. 12 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం చెబుతున్న మాటల్లో నిజం లేదని, అనేక ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించింది. రాష్ట్రంలో మహిళలపై నేరాలు, పోక్సో కేసులు విపరీతంగా పెరిగాయని, తమిళనాడు 'ఆత్మహత్యల రాజధాని'గా మారుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొంది. సెషన్ ప్రారంభంలో రాష్ట్ర గీతం (తమిళ తాయి వాజ్తు) పాడుతున్నారని, జాతీయ గీతాన్ని విస్మరించి రాజ్యాంగ విధులను అవమానిస్తున్నారని గవర్నర్ కార్యాలయం ఆగ్రహం వ్యక్తం చేసింది.



**ప్రభుత్వం స్పందన**

ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ గవర్నర్ తీరును తీవ్రంగా ఖండించారు. శాసనసభ సంప్రదాయాలను గవర్నర్ గౌరవించడం లేదని మండిపడ్డారు. "మేకకు గడ్డం, రాష్ట్రానికి గవర్నర్ అనవసరం" అని గతంలో డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై చెప్పిన మాటలను సీఎం గుర్తు చేశారు. గవర్నర్ ప్రసంగించకపోయినా, ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగాన్ని సభ రికార్డుల్లోకి ఎక్కించేలా స్టాలిన్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. గత మూడేళ్ళుగా తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ మధ్య జాతీయ గీతం ప్రొటోకాల్, ప్రసంగ అంశాలపై ఇదే తరహా వివాదాలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు కేవలం మూడు నెలల సమయం ఉన్న తరుణంలో ఈ గొడవ మరింత రాజకీయ వేడిని రాజేసింది.

# నేనే సిట్‌కు వంద ప్రశ్నలు వేశా

**విచారణ అనంతరం హరీశ్ రావు**

- **దమ్ముంటే విచారణకు సంబంధించిన వీడియోలు విడుదల చేయాలని సవాల్**
- **ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకేం సంబంధమని ప్రశ్న**

**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ తనను ప్రశ్నించడం కాదని, తానే సిట్‌కు వంద ప్రశ్నలు వేశానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు పేర్కొన్నారు. దమ్ముంటే విచారణకు సంబంధించిన వీడియోలను విడుదల చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాను హోంమంత్రిగా ఎప్పుడైనా పని చేశానా అని వ్యాఖ్యానించారు. నాటి డీజీపీ, చీఫ్ ఇంటెలిజెన్స్‌ను కూడా విచారణకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీశ్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు దాదాపు ఏడు గంటలకు పైగా విచారించారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నోటీసులు, విచారణలు బీఆర్ఎస్‌ను భయపెట్టలేవని ఆయన అన్నారు. రేపు ప్రజా కోర్టులో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల గురించి మంత్రులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అరెస్టులు తమకు కొత్తేమీ కాదని ఆయన అన్నారు. ముగ్గురు అధికారులతో కూడిన సిట్ దర్యాప్తు బృందం తనను ప్రశ్నించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాయతీపరుడైతే ఈ అంశంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిరికిపందలా పోలీసులను వెనుకబెట్టుకుని కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, సిట్ అధికారులు ఎన్నిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని ఆయన అన్నారు. వారి కుంభకోణాలు, చీకటి రాజకీయాలను బయటపెడుతున్నామని తమపై కేసులు పెడుతున్నారని హరీశ్ ఆరోపించారు. మీ దోపిడీలను ప్రశ్నిస్తున్నామని, మాపై కేసులు పెడతారా అని నిలదీశారు. తమపై అన్నీ నిరాధార ఆరోపణలేనని, సొల్లు పురాణాలేనని విమర్శించారు. తనను అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాష వింటేనే రోత పుడుతోందని అన్నారు. కేసీఆర్ తమకు నేర్పింది పోరాటమే అన్నారు. ఇప్పుడు తనకు సిట్ ద్వారా వచ్చిన నోటీసులు మీ పతనానికి నాంది అని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

# అలుపెరుగని జూపల్లి

## ఒక్కరోజులో నాలుగు జిల్లాల చుట్టేసిన మంత్రి

- **48 గంటలు.. 1000 కిలోమీటర్ల 'మారథాన్ టూర్**
- **అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ లో జూపల్లి కృష్ణారావు నిబద్ధత**
- **మంత్రి పనితీరుకు ఆశ్చర్యపోతున్న నేతలు, అధికారులు**

(మొదటిపేజీ తరువాయి)

చుట్టేసి తనకు బాధ్యత పట్ల మక్కువెంతో తెలియ చెప్పారు.ప్రజా పాలనలో ఎప్పుడూ వినూత్న రీతిని అనుసరిస్తూ, తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకునే మంత్రి జూపల్లి కృష్ణారావు అలుపెరగని బాటసారిలా సాగించిన సుదీర్ఘ పర్యటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేవలం 48 గంటల కాల వ్యవధిలో సుమారు వెయ్యి కిలోమీటర్ల మేర సాగించిన పర్యటన ఆయనేంటో అర్ధమయ్యేలా తెలియ చెప్పింది.

### సాగిందిలా..

ఆదివారం మధ్యాహ్నం భాగ్యనగరం నుంచి ప్రారంభమైన పర్యటనా ప్రస్థానం, అడవి బిడ్డల ఆరాధ్య దైవం మేడారం సమ్మక్కసారలమ్మ గడప వరకు సాగింది. అక్కడ జరిగిన మంత్రివర్గ సమావేశంలో చురుగ్గా పాల్గొన్న ఆయన, సోమవారం వేకువజామునే వనదేవతల ఆశీస్సులు పొంది, అటు నుంచి అటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పయనించారు.



ఒక సుడిగాలిలా సాగిన ఈ పర్యటనలో భాగంగా మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చేరుకున్న ఆయన.. మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా, సర్పంచుల పరిచయ కార్యక్రమంతో పాటు రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ వారిలో నూతనోత్సాహాన్ని నింపారు. అక్కడి నుంచి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్ నగర్, వాంకిడి, ఆసిఫాబాద్ ప్రాంతాల మీదుగా ఆయన ప్రయాణం రికార్డు స్థాయి వేగంతో కొనసాగింది. వరుస అభివృద్ధి పనులు, శంకుస్థాపనలతో జిల్లా యంత్రాంగాన్ని ఉరుకులు పెట్టించింది. ఆసిఫాబాద్ పర్యటన అనంతరం హైదరాబాద్ తిరిగి వెళ్లేలా ఉన్నహెడ్యూల్ మార్చి సోమవారం రాత్రి ఆసిఫాబాద్ జిల్లా నుండి ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ చేరుకుని నాగోబా ను దర్శించుకుని ఆదివాసీలతో మమేకమయ్యారు. వారి సమస్యల పరిష్కారానికి తనవంతు భరోసా నిచ్చారు. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో నిర్మల్ ఉత్సవాల వేదిక వద్దకు చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ కూడా ప్రజాసమక్షంలో ఉత్సాహంగా గడిపిన ఆయన రాత్రి అక్కడే కాసేపు బస చేసారు. మంగళవారం ఉదయమే రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా అరైవ్ అలైవ్" పేరిట నిర్వహించిన ప్రచారం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకీ షర్మిళ, ఇతర అధికారులతో కలిసి పాల్గొని పతంగులను ఎగురవేశారు. అనంతరం 9 గంటలకే మళ్లీ రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించి మధ్యాహ్నం 12 గంటల కల్లా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చేరుకున్నారు.

**పాలనలో వేగం..**

**ఒకే రోజులో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నాలుగు జిల్లాలను సందర్శించి, అధికారిక బాధ్యతలను నెరవేరుస్తూనే పార్టీ పటిష్టతకు కృషి చేయడం ఆయన కార్యదక్షత కు నిదర్శనం. ఈ 48 గంటల పర్యటన జూపల్లి అకుంఠిత దీక్షకు, ప్రజా సేవ పట్ల ఉన్న మక్కువకు ఒక సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4 జిల్లాలను ఒకే రోజు చుట్టివచ్చి ఒక 'మారథాన్' పర్యటనతో ఆయన రాజకీయ క్షేత్రంలో రికార్డు సృష్టించారు. విశ్రాంతిని సైతం విస్మరించి, ప్రజల కోసం పరుగు తీయడమే తన నైజమని ఈ సుడిగాలి పర్యటన ద్వారా ఆయన మరోసారి నిరూపించారు.**

# బీజేపీ చేతిలోనే దేశం సురక్షితం

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో సాధారణ కార్యకర్త కూడా పార్టీ జాతీయ అధ్యక్షుడు కాగలరని ప్రధాని మోదీ తెలిపారు. భారతీయ జనతా పార్టీ నిర్ణయాలు, ఎంపిక అన్నీ ప్రజాసామ్యయుతంగా ఉంటాయని చెప్పారు. దేశ సేవ, ప్రజా సేవ లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయన్నారు. కార్యకర్త కేంద్రంగా పార్టీ సిద్ధాంతాలు ఉంటాయని తెలిపారు. బీజేపీ కార్యకర్త అని అనిపించుకోవడమే తన గర్వకారణంగా ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు.

**పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది: ప్రధాని**

గతంలో ఎల్‌కే అద్వానీ, వెంకయ్యనాయుడు నేతృత్వంలో ఘన విజయాలు సాధించామని మోదీ గుర్తు చేసుకున్నారు. అందరి కృషితోనే వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చేలా పార్టీ ఎదిగిందని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉందని తెలిపారు. బీజేపీ చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నట్లు మోదీ తెలిపారు. "బీజేపీలో ప్రత్యేకంగా పదవులు, బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్క కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. పార్టీ కోసం కృషి చేయాలి. కొత్తగా వస్తున్న మార్పులను పార్టీ అందిపుచ్చుకోవాలి, అనుసరించాలి. రేడియో నుంచి ఏఐ పరిజ్ఞానం వరకు అన్నింటినీ ఉపయోగించుకోవాలి. పార్టీ బాధ్యతలను జీవనశైలిగా భావించాలి. బాధ్యతలు ఒకరి నుంచి ఒకరికి మారుతాయి, లక్ష్యం మారదు. నాయకత్వం మారినా మన గమ్యం మారొద్దు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలి" అంటూ మోదీ పిలుపునిచ్చారు.



# బాస్ బస్టర్

**మెగా మూవీపై అల్లు అర్జున్ రియాక్షన్**

**మహా:** మన శంకరవరప్రసాద్‌గారు'ఈ సంక్రాంతికి వచ్చిన బ్లాక్‌బస్టర్ మాత్రమే కాదని, ఇది సంక్రాంతి 'బాస్' బస్టర్ అంటూ ప్రముఖ హీరో అల్లు అర్జున్ కితాబిచ్చారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా చిత్ర బృందానికి శుభాకాంక్షలు చెబుతూ అల్లు అర్జున్ స్పెషల్ పోస్ట్ పెట్టారు. బాస్ ఈజ్ బ్యాక్.. నిజంగా ఇదొక అద్భుతం. మన మెగాస్టార్ చిరంజీవిగారిని ఇలా చూడటం చాలా సంతోషంగా ఉంది. వింటేజ్ వైబ్స్‌తో వెండితెర వెలిగిపోయింది అంటూ ప్రశంసలు కురిపించారు. బ్లాక్ బస్టర్ మెషీన్ దర్శకుడు అనిల్ రావిపూడికి శుభాకాంక్షలు. 'సంక్రాంతికి వస్తారు.. హిట్ కొడతారు.. రిపీట్ ..అంటూ ప్రశంసలు కురిపించారు. అల్లు అర్జున్ ట్వీట్ తో మెగా అభిమానుల్లో సంతోషం నెలకొంది. సినిమా రిలీజైన తొలిరోజే బాస్ చించేశారు అంటూ అల్లు అరవింద్ కూడా సూపర్ రివ్యూ ఇచ్చారు.

# దావోస్‌లో తెలంగాణ తొలి విజయం






(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని, ఇటీవలే రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం వెల్లడించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ తరపున ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

**గూగుల్ బృందానికి సీఎం కృతజ్ఞతలు**

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లలో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో సీఎం రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఏపీఏసీ) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా వాతావరణంలో పెను మార్పులు, వ్యవసాయంపై దాని ప్రభావం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. తొలి గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినందుకు గూగుల్ బృందానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. సీఎంతో పాటు సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విస్తృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా, టీఫైబర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ అందిస్తుందని వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## నాగోబా సేవలో తరించిన జిల్లా ఇంచార్జి మంత్రి

- గిరిజన సంస్కృతికి నాగోబా జాతర ప్రతీక
- గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**ఆదిలాబాద్ మహా:** గిరిజనుల ఆచార వ్యవహారాలకు, వారి విశిష్ట సంస్కృతికి నాగోబా జాతర ఒక నిదర్శనమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. ఇంద్రవెల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కేస్లాపూర్ నాగోబా దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పి ఓ యువరాజ్ మర్మట్, ఆలయ పూజారులు, మెస్రం వంశీయులు సాంప్రదాయబద్ధంగా మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన నాగోబా దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దేశంలోని నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ఈ జాతర, రాష్ట్రంలోనే అత్యంత ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పించిందని మంత్రి తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాల విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేశారని ఆయన వెల్లడించారు. గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ,గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని, వారి అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం మంత్రిని కలెక్టర్, ఎస్పీ శాలువాతో సత్కరించి నాగోబా చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మెస్రం వంశీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి జూపల్లి నిర్మల్ ఉత్సవాల ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. మంత్రికి గుస్సాడి నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి అన్ని స్టాళ్లను సందర్శించారు. నిర్మల్ ఉత్సవాల పేరిట ఎంతో గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.




## అరైవ్ అలైవ్ వినూత్న ప్రచారం

**గాలిపటాలు ఎగురవేసిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి**

**ఆదిలాబాద్ మహా :** ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నిర్మల్ ఐ డి ఓ సి ప్రాంగణంలో నిర్వహించిన అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు .జిల్లా ఎస్పీ జానకి షర్మిల తో కలిసి అరైవ్ అలైవ్ గాలిపటాలను ఎగురవేసి వినూత్నరీతిలో అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటించడంతో పాటు, రోడ్డుపై ప్రయాణించే ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని మంత్రి సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ చేపడుతున్న ఈ అవగాహన ఉద్యమం ప్రజల్లో మంచి మార్పు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి

**రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (కార్పొరేట్) అధికారి, మందమర్రి జిఎం లు వెల్లడి**



**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియాలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (కార్పొరేట్) అధికారి సిహెచ్ వెంకటరమణ, మందమర్రి జిఎం ఎన్ రాధాకృష్ణ లు వెల్లడించారు. మంగళవారం మందమర్రి ఏరియాను రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (కార్పొరేట్) అధికారి సి.హెచ్. వెంకటరమణ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వెల్లడించారు. ప్రతి ఒక్క ఉద్యోగి అంకితభావంతో కృషి చేసినప్పుడే లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సులువవుతుందని అన్నారు. అనంతరం (కార్పొరేట్) అధికారి సి.హెచ్. వెంకటరమణను జిఎం ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం. జి.ఎల్. ప్రసాద్, డి జి ఎం పర్సనల్ సి.హెచ్. అశోక్. ఐ. ఈ.డి. (డీజీఎం). కిరణ్ కుమార్, అకౌంట్స్ (డి జి ఎం )ఆర్ వి .ఎస్ ఆర్. కె. ప్రసాద్ ,ఏరియా సర్వే ఆఫీసర్ డీజీఎం. దేశాయి , డి వై ఎస్ సి ఈ అండ్ ఎం పర్చేస్ బాబు, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

**షాద్ నగర్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ హనీఫ్**

**ఆమనగల్లు, మహా :** రోడ్డు భద్రత నియమాలు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థి దశమంచే అవగాహన కలిగి ఉండాలని షాద్ నగర్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ హనీఫ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అరబిందో ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై విద్యార్థులచే సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ద్విచక్ర వాహనాలను నడపరాదని, ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నాగమణి, ఉపాధ్యాయ బృందం భాస్కర్, నరేష్, నజీర్, రతీష్, అజిత్ తదితరులు పాల్గొన్నారు



## ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఆమనగల్లు, మహా:** ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ అనురాగిణి రెడ్డి సూచించారు.మంగళవారం ఆమనగల్లు సీహెచ్సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం నూతన ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. డాక్టర్లు నాగరాజు, మైమునా బేగం, జయశ్రీ, మంజుల దేవి,సిబ్బంది ఉన్నారు.

## మైనారిటీ గురుకులాలలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల, మహా:** మంచిర్యాల జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థలలో ప్రవేశాల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో గురుకుల విద్యా సంస్థలలో ప్రవేశాలకు సంబంధించిన గోడ ప్రతులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకుల విద్యా సంస్థలలో 5వ తరగతి నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రవేశాల కొరకు మైనారిటీ విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు ఆన్ లైన్ లో tgmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు పొందవచ్చని, వివరాల కొరకు కంట్రోల్ రూమ్ నం.7331170790 లో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎండి. తాహేరుద్దీన్, అకాడమీ సమన్వయకర్త రిజ్వాన్, మంచిర్యాల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ మందపెల్లి సంధ్య, చెన్నూర్ పాఠశాల ప్రిన్సిపల్ గోపి, కళాశాల ప్రిన్సిపల్ సమ్మయ్య, బెల్లంపల్లి ప్రిన్సిపల్ నీలు తదితరులు పాల్గొన్నారు.

## బహుళ ప్రమాదాల విపత్తులపై మాక్ డ్రిల్

- **నేడు జిల్లాలో ప్రయోగాత్మకంగా శంషాబాద్ లో నిర్వహణ**
- **ఎన్.డి.ఏం.ఏ అధికారులు**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బహుళ ప్రమాదాల విపత్తులపై మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎన్.డి.ఏం.ఏ అధికారులు సూచించారు.బహుళ ప్రమాదాల విపత్తు నిర్వహణ సంబంధిత మాక్ డ్రిల్ నేడు జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహించనున్న మాక్ ఎక్సర్ సైజ్ కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బహుళ విపత్తుల దృశ్యం ఆధారంగా మాక్ డ్రిల్ సంభవించిన వెంటనే చేపట్టాల్సిన తక్షణ చర్యలు, సమన్వయం, సమాచార వ్యవస్థ, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మాక్ డ్రిల్ నిర్వహణకు నిర్ణీత ప్రణాళిక, ఆయా శాఖల బాధ్యతలు, విమానయానేతర రంగంలో విపత్తు నిర్వహణకు సంబంధించిన మాక్ డ్రిల్ ఈ నేడు బుధవారం శంషాబాద్ లోని ఎయిర్ పోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బహుళ ప్రమాదాల విపత్తులు, వరదలు, ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి, ఆస్తి, ప్రాణనష్టం నివారించేందుకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలి అనే అంశాలపై ఈ మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కలుగుతుందని, విపత్తులను ఎదుర్కొనే విషయంలో సన్నద్ధత ఏ మేరకు కలిగి ఉన్నామనేది అవగతం అవుతుందని అన్నారు. మాక్ ఎక్సర్ సైజ్ ను పకడ్బందీగా, విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని ఎన్.డి.ఏం.ఏ అధికారులు సూచించారు. ఇది కేవలం మాక్స్ ఎక్సైజ్ మాత్రమే అని, దీని ద్వారా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని, విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు భయపడకుండా, ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ మాక్ ఎక్సైజ్ ను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి వదంతలను ప్రచారం చేయొద్దని కోరారు.



## నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు: భిక్షపతి

**ఆమనగల్లు, మహా:** కడ్తాల మండల కేంద్రంలోని కాలనీలలో నీటీ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కడ్తాల గ్రామ సర్పంచ్ రాయికంటి భిక్షపతి అన్నారు.మండల కేంద్రంలోని 2వ వార్డులో నీటీ సమస్య ఉండటంతో ఆయా కాలనీల వాసులు సమస్యను వార్డు సభ్యుడితో పాటు, సర్పంచ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.ఈ మేరకు మంగళవారం ఉదయం కాలనీలో సర్పంచ్ వార్డు సభ్యుడితో కలిసి పర్యటించి, నీటీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకుని,వెంటనే నీటీ సమస్య పరిష్కారానికై నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేసి పబ్లిక్ కోళాయిని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో నీటీ సమస్యతోపాటు పారిశుధ్య సమస్యలు ఉంటే గ్రామ పంచాయతీ ప్రజలు తన దృష్టికి తేవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఅప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, వార్డు సభ్యురాలు నూర్జహాన్ , గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


## ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలి

- "అరైవ్–అలైవ్" కార్యక్రమంలో ఆటో, లారీ డ్రైవర్లకు అవగాహన
- మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ వెల్లడి




**మంచిర్యాల, మహా :** వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఏ భాస్కర్ వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, వాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడం అనే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "అరైవ్-అలైవ్" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ప్రస్తుతం నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఆటో ,లారీ డ్రైవర్లు, ఇతర వాహన యజమానులకు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 150 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా వెనుకబడ్డాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇందులో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లు నడిపేవారు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం సేవించి, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లేదా శాశ్వత వికలాంగులుగా మారిన వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు,మానసిక వేదన మరియు కుటుంబంపై పడిన తీవ్ర ప్రభావాన్ని ప్రజలకు, వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరూ మద్యం సేవించి వాహనం నడపకుండా,ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ తమ కుటుంబాలను, సమాజాన్ని సురక్షితంగా ఉంచాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## బస్తీ దవాఖాన ప్రారంభించిన ఎమ్మెల్యే వేర్లపల్లి శంకర్.



**షాద్ నగర్. మహా,** షాద్ నగర్ పట్టణంలోని 20వ వార్డు (పాత గంజి) లో బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి కే లలితాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డిపిఓ అక్రమ్, సీసీ సురేష్, డాక్టర్ స్రవంతి చించోడు, డాక్టర్ దామోదర్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు దవాఖానాలకు దీటుగా తీర్చిదిద్ది అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని సర్కారు దవాఖానాల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించి పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. మా ప్రభుత్వ ముఖ్యంగా వైద్యం, విద్య ఈ రెండిటికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని అప్పుల పాలు అవుతున్నారని అందుకే పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో బస్తీ దవఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఈ దవఖానాల్లో ప్రతి రోగానికి రక్త పరీక్షలతో పాటు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచడం జరిగిందని ఇక్కడున్న సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



## వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం

**ఆమనగల్లు, మహా :** అమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటల నుండి 12గంటల వరకు సుప్రభాతం, అభిషేకం, ప్రత్యేక పూజాకార్యక్రమం, ఆర్యవైశ్య మహిళలతో సామూహికకుంకుమార్చన, హోమం అమ్మవారి ఆత్మర్పణ నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శివానంద స్వామి ప్రత్యేక హోమ కార్యక్రమం దినేష్ పూజారిచే కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు వీరబ్రహ్మ రామ్మోహన్, ట్రస్ట్ మెంబర్ వైస్ చైర్మన్ బి పాండయ్య, డాక్టర్ వాసు,బి నరసింహ, అర్థం లక్ష్మయ్య, మంచుకొండ విష్ణువర్ధన్,దొంతు సత్యం, జూలూరి నరసింహ, మల్లేష్,తేజ వర్ధన్,సామల కృష్ణ, నటరాజ్,బి యాదయ్య, గార్లపాటి రాములు, పెండ్యాల నాగరాజ్,బిక్కుమాండ్ల శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగి గ్రామంలో అంగరంగ వైభవంగా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం

**పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్**



**గండిపేట, మహా:** నార్సింగ్ సర్కిల్ పరిధిలోని నార్సింగి గ్రామంలోని మల్లన్న స్వామి ఆలయంలో శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం గండిపేట మండలం కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో నిర్వహించబడింది. ఈ వేడుకలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శాస్త్రోక్తంగా జరిగిన కళ్యాణం లో ఆయన పాల్గొని ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఎంతటి విశిష్టతను కలిగి ఉంటుందో, అదే తరహాలో నార్సింగి ప్రాంతంలో కూడా ప్రతి ఏటా ఈ వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం గర్వకారణమని కొనియాడారు. ఈ సంప్రదాయం మన ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. మల్లన్న స్వామి వారి ఆశీస్సులతో రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ప్రతి ఇల్లు అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని, ప్రజలందరికీ మేలు జరగాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. టిడిపి రాష్ట్ర నాయకులు సూర్య ప్రకాష్, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వేణు గౌడ్ , గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ ప్రవీణ్ కుమార్ , స్థానిక నాయకులు, కైరంకొండ వినోద్, కైరంకొండ రాము, దుద్దు కిరణ్ , జల్లి వెంకటేష్,రామేశ్వరం నరసింహ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ లో చేరికలు

**కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి**

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ ప్రజలకు కాలనీకి తాను అండగా ఉంటానని ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆదుకుంటానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో జరిగిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.7వ వార్డు కేఆర్కే కాలనీ నుండి సాయిరామ్ మహారాజ్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు, అల్చెట్టి నాగన్న ఆధ్వర్యంలో 10 వార్డు రాంనగర్ నుండి పెద్ద సంఖ్యలో కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారందరికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. పేదవాళ్లకు సేవ చెయ్యడానికి తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక మంచి సంక్షేమ పథకాల పట్ల ప్రజలనుండి మంచి స్పందన వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. అందుకే ఇతర పార్టీల నుండి కూడా నిత్యం తమ పార్టీలోకి చేరికలు జరుతున్నాయన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటి పీఠాన్ని కైవసం చేసుకుంటామన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అంతా కష్టపడి పని చేస్తామన్నారు.అనంతరం బేల మండలం పాఠన్ సర్పంచ్ గెడం గులాబ్ , ఉప సర్పంచ్ రాజును శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, బేల కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఫైజుల్లాఖాన్, పాఠన్ సర్పంచ్ గెడం గులాబ్ , ఉప సర్పంచ్ రాజు , గణపతి రెడ్డి ,ప్రకాష్, నానాజీ, రఫీక్, అశోక్ , రాంరెడ్డి,పురుషోత్తం రెడ్డి, అశోక్ రెడ్డి,గోవింద, రాజి రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి ఆకాష్ రెడ్డి సూరజ్ తదితరులు పాల్గొన్నారు.





## ఆ సినిమాపై ఎన్టీఆర్ ప్రశంసలు..

# కథ అద్భుతమంటూ ట్వీట్

దండోరా మూవీపై జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారని అన్నారు. ఇప్పుడు దండోరా సినిమా చూశానని.. చాలా ఆలోచించేలా చేసిందని కొనియాడారు. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి అద్భుతంగా నటించారని ఎన్టీఆర్ ప్రశంసించారు. ఇంత బలమైన కథను అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్‌కు నా ప్రత్యేక అభినందనలు అంటూ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఈ ప్రయత్నానికి మద్దతు ఇచ్చినందుకు రవీంద్ర బెనర్జీకి నా అభినందనలు అంటూ పోస్ట్ చేశారు. ఇంతటి అద్భుతమైన చిత్రానికి మద్దతు ఇచ్చి.. ఈ మూవీలో భాగమైనందుకు తారాగణం, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ట్వీట్ చేశారు. ఇది కాస్తా నెట్టింట వైరల్ కావడంతో.. హీరో నవదీప్ రిప్లై ఇచ్చాడు. థ్యాంక్ యూ అన్నయ్య అంటూ పోస్ట్ చేశాడు.

కాగా.. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం సలార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వస్తున్న మూవీకి డ్రాగన్ అనే పేరు టైటిల్ పెట్టనున్నారని టాక్. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో యానిమల్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారని అఫీషియల్ ప్రకటన వచ్చేసింది.

## అది నిజం కాదు.. కానీ


# నిజం కావాలి : రష్మిక

"నా జీవితంలో జరిగిన ప్రతి విషయం నుంచి ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటాను" అని హీరోయిన్ రష్మికా మందన్నా అంటున్నారు. నటిగా తన కథల ఎంపిక, పారితోషికం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించారు రష్మిక. ఆమె మాట్లాడుతూ–"హీరోయిన్‌గా ప్రేక్షకులకు వినోదాన్ని అందించడమే నా పని. ఎలాంటి భాషాపరమైన హద్దులు లేకుండా, అందరికీ నచ్చే చిత్రాలు చేయడానికే ప్రయత్నిస్తుంటాను. కొంతమంది ప్రేక్షకులకు లవ్‌స్టోరీ సినిమాలు ఇష్టం. ఇంకొంతమంది వాణిజ్య చిత్రాలను ఇష్టపడతారు. అందుకే కమర్షియల్, లవ్ స్టోరీ, ఉమెన్ సెంట్రిక్... ఇలా విభిన్న రకాల జానర్స్‌లో సినిమాలు చేస్తున్నాను. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడం కోసమే వైవిధ్యమైన కథలను ఎంచుకుంటున్నాను. ఇకపై కూడా ఇలానే ముందుకు సాగుతాను. ఇక స్పెషల్ సాంగ్స్ చేయడంపైనా నాకు ఆసక్తి ఉంది. కాకపోతే ఆ చిత్రంలో నేనే హీరోయిన్ గా ఉండాలి. లేదంటే.. ఇండస్ట్రీలో ఉన్న ఓ నలుగురు డైరెక్టర్స్ సినిమాల్లో మాత్రం లీడ్ రోల్ కాకపోయినా స్పెషల్ సాంగ్ చేస్తాను. అలాగే ఇండస్ట్రీలో ఎక్కువ పారితోషికం తీసుకునే నటిని నేనే అనుకుంటున్నారు.. అయితే ఇది నిజం కాదు. కానీ, అది నిజం కావాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.



# గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్–2025.. ఉత్తర్వులు జారీ

గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రకటన వచ్చేసింది. ఈమేరకు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) పొందిన చిత్రాలకు అవార్డ్స్ ఇస్తామని దరఖాస్తులను ఆహ్వానించింది. ఇదే విషయాన్ని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. పరిశ్రమంలోని 17 విభాగాల్లో గద్దర్ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చిన పేర్కొన్నారు. వ్యక్తిగత విభాగంలోనూ గద్దర్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తెలిపింది. జనవరి 21 నుంచి 31 వరకు దరఖాస్తు స్వీకరణ ఉంటుందని ప్రకటించారు.






# నా ఫోటోలు జూమ్ చేసి చూశారు..

తెలుగు నటి ఈషా రెబ్బా తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఇబ్బందులను పంచుకుంది. సోషల్‌మీడియా నుంచి హీరోయిన్‌గా ఎదిగిన ఈ బ్యూటీ.. ఫేస్‌బుక్‌లో షేర్ చేసిన తన ఫోటోలను చూసి దర్శకుడు ఇంద్రగంటి మోహన కృష్ణ తొలి ఛాన్స్ ఇచ్చారు. ఆ తర్వాత అరవింద సమేత, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, ఓయ్, సవ్యసాచి, 3 రోజెస్ వంటి ప్రాజెక్ట్‌లతో ఆలరించింది. తాజాగా తన నటించిన ఓం శాంతి శాంతి శాంతిః మూవీ జనవరి 30న విడుదల కానుంది. ఈ క్రమంలోనే మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈషా రెబ్బా(Eesha Rebba) తన కలర్ గురించి ఎదుర్కొన ఘటనను గుర్తు చేసుకుంది. 'ఒక సినిమా కోసం నేను ఫోటో షూట్‌లో పాల్గొన్నాను. అయితే, దర్శకుడు నా ఫోటోలను చాలా జూమ్ చేసి మోచేతులు నల్లగా ఉన్నాయని, మరింత అందంగా ఉండాలని కోరారు.. ఆయన మాటలు నన్ను బాధపెట్టాయి. చాలా నిరుత్సాహం చెందాను. ఆ సమయంలో ఆయనకు ఏ సమాధానం ఇవ్వాలనేది కూడా తెలియలేదు. నా పుట్టుకతో వచ్చిన రంగును ఎలా మార్చుకోగలమని చెప్పాను. పరిశ్రమలో ఇలాంటివి సాధారణంగా జరుగుతుంటాయని అప్పట్లో నాకు తెలీదు. అయితే, ఆయన వ్యాఖ్యలతో నేను కూడా మరింత కలర్‌గా ఉంటే బాగుండేదేమో అనిపించింది. కానీ, వారి కోసం నా కలర్‌ను మార్చుకోలేను కదా.. ఆ సమయం నుంచి మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లడం నేర్చుకున్నాను.' అని గుర్తుచేసుకుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034